www.prajasakti.com
ప్రజాశక్తి
శనివారం 3 మే 2025
5
తూర్పుగోదావరి



హైదరాబాద్ వెళ్లి పింఛను అందజేత

ప్రజాశక్తి - చాగల్లు

హైదరాబాద్‌లోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న చాగల్లుకు చెందిన కొరారు జ్ఞాన ప్రసంతికి వీఆర్‌ఓ జొన్నకూటి శేషు శుక్రవారం పింఛను అందించారు. చాగల్లుకు చెందిన ఆమె బెంగళూరులో ఉద్యోగం చేస్తూ 2017లో రైలు ప్రమాదానికి గురై రెండు కాళ్లు కోల్పోయింది. అప్పటి నుంచి వికలాంగుల పింఛను తీసుకుంటోంది. ఇటీవల అనారోగ్యానికి గురవ్వడంతో హైదరాబాద్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతుంది. మూడు నెలలుగా ఆమె పింఛను దూరమైంది. దీంతో వీఆర్‌ఓ శేషు హైదరాబాద్ వెళ్లి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆమెకు మూడు నెలలకు సంబంధించిన రూ.18వేల పింఛను అందించారు. ఈ సందర్భంగా వీఆర్‌ఓను తహశీల్దార్ మెరికమ్మ తదితరులు అభినందించారు.

భానుడి భగభగలు

రోజు రోజుకీ పెరుగుతున్న ఉష్ణోగ్రతలు
అప్రమత్తంగా ఉండాలంటున్న వైద్యులు



ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

భానుని భగ భగలు మొదలయ్యాయి. మే నెల ప్రారంభం నుంచి సూర్యుడు సుర్రుమనిపిస్తున్నాడు. జిల్లాలో రాజమహేంద్రవరంతో పాటు పలు పట్టణాల్లో ఎండల తీవ్రత ఎక్కువగా ఉంది. మధ్యాహ్నం వేళ ముఖ్య కూడళ్ళు ఖాళీగా దర్శనమిస్తున్నాయి. ఉదయం 10గంటల నుంచే వేసవి తాపం మొదలవుతోంది. మధ్యాహ్నమైతే రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారుతున్నాయి. గతేడాది వేసవిలో గరిష్ఠంగా 40 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఒకట్రెండు రోజులు మాత్రమే నాడు ఈ పరిస్థితి తలెత్తింది. కాని ఈ ఏడాది జిల్లాలో ఇప్పటికే 41 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. వారం రోజుల నుంచి క్రమంగా ఎండలు పెరుగుతున్నాయి. మే మొదట్లోనే ఇలా ఉంటే రానున్న కాలంలో పరిస్థితులు ఎలా ఉంటాయోనని జనం బెంబేలెత్తుతున్నారు. రానున్న రోజుల్లో ఉష్ణోగ్రతలు మరింత తీవ్రతరం కానున్నాయని వాతావరణ శాఖ హెచ్చరికలు ప్రజలను భయాందోళనకు గురిచేస్తున్నాయి.

కొబ్బరి బొండాలు, శీతల పానీయాలకు గిరాకీ

ఎండలు, ఉక్కపోత పెరగడంతో ఉపశమనం కోసం ప్రజలు కొబ్బరి బొండాలు, శీతల పానీయాలు, జ్యూస్ సెంటర్లు, ఐస్‌క్రీమ్ షాపులను ఆశ్రయిస్తున్నారు. ఇప్పటికే శీతల పానీయాలకు సంబంధించిన వ్యాపారాలు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి. గతంలో ఒకేచోట స్థిరమైన వ్యాపారాలు ఉండేవి. కానీ ఇప్పుడు మొబైల్ వ్యాపారాలతో జనసంచార ప్రాంతాల్లో అడ్డా వేస్తున్నారు. చెరకు రసం, సోడాలు, పుచ్చకాయలు, కొబ్బరి బొండాలు, లస్సీ, పండ్ల రసాలు, మజ్జిగ విక్రయాలు ఊపందుకున్నాయి.

తగిన జాగ్రత్తలు అవసరం

ఎండలు ఎక్కువగా ఉండటంతో తగిన జాగ్రత్తలు తీసుకోవడం అవసరమని వైద్యులు సూచిస్తున్నారు. ఎండలో ఎక్కువ సేపు ఉంటే తల తిరగడం, తలనొప్పి, సొమ్మసిల్లి పడిపోయే లక్షణాలు ఉంటే వడదెబ్బ గురైనట్లు గుర్తించాలి. ఇలాంటి వారికి నాలిక పొడిబారి పోయినట్లు అనిపిస్తుంది. ఈ దశలో రక్త నాళాలు వ్యాకోచించి మెదడుకు సరిగ్గా రక్తం అందదు. ఈ పరిస్థితిని హీట్ సింకోప్ అంటారు. ఇది వడదెబ్బకు దారితీస్తుంది. రాత్రివేళలో కాలిపిక్కలు పట్టేసినట్లు, తీవ్రమైన నొప్పి మొదలవుతుంది. ఎక్కువగా పిల్లల్లో, పెద్దల్లో వస్తుంది. ఎండ తీవ్రత వల్ల శరీరంలో లవణాలు కోల్పోవడం వల్ల కండరాలు మెదడు నుంచి ఆదేశాలు సరిగ్గా అందవు. స్పృహ తప్పిపోయే ప్రమాదమూ ఉంది.

వడదెబ్బ తగిలిన వ్యక్తిని వెంటనే నీడ ఉన్న చల్లని ప్రదేశానికి తీసుకెళ్లాలి. శరీర ఉష్ణోగ్రత తగ్గేలా చల్లని నీటితో తుడవాలి. కొంత సేద తీరినతరువాత చల్లని మజ్జిగ, నీరు, కొబ్బరి నీళ్లు, ఒఆర్‌ఎస్ ద్రావణాన్ని అందించాలి. సాధ్యమైనంత త్వరగా వైద్యుని వద్దకు తీసుకెళ్లాలి.

ఎండ ఎక్కువగా ఉండే సమయంలో బయటకు వెళ్లకూడదు. ఏదైనా పని ఉంటే ఉదయం 11గంటల లోపు, సాయంత్రం 4 తర్వాత చేసుకునేలా ప్రణాళికలు తయారు చేసుకోవాలి. మసాల ఆహారానికి దూరంగా ఉండటం మంచిది. మద్యం, సిగరేట్, బిర్యానీలకు దూరంగా ఉండాలి. చిన్నపిల్లలకు వదులుగా ఉండే దుస్తులు వేయాలి.

బయటకు వెళ్లే గొడుగు లేదా టోపీ పెట్టుకోవాలి. ద్రవపదార్థాలు ఎక్కువగా తీసుకోవాలి. నీళ్లు, కొబ్బరినీళ్లు, మజ్జిగ తాగాలి. ఎండలో తిరిగినప్పుడు చెమటతోపాటు శరీరంలోని ఎలక్ట్రోలైట్స్ కూడా బయటకుపోతాయి. కావున ఓఆర్‌ఎస్ నీళ్లు, ఉప్పు వేసిన నిమ్మరసం తాగాలి. రోజుకు 3 లీటర్లు కనీసం మంచినీళ్లు తాగాలి. పుచ్చకాయ, నిమ్మకాయ, కీరదోసలు ఎక్కువగా తినాలి. అపస్మారక స్థితిలోకి వెళ్లినట్టయితే వైద్య ఆరోగ్య శాఖకు సమాచారం ఇవ్వాలి. తక్షణమే సమీపంలోని వైద్యులను సంప్రదించాలి.



ఎండలతో జనం లేక బోసిపోయిన దేవీచౌక్ సెంటర్

గత ఐదురోజుల్లో ఉష్ణోగ్రతలు సెం.గ్రేల్లో

	గరిష్ఠం	కనిష్ఠం
2 మే 2025	40	31
1 మే 2025	39	27
30 మార్చి	39	27
29 మార్చి	38	28
28 మార్చి	37	27



సమావేశంలో మాట్లాడుతున్న జెసి

లబ్ధిదారుల గుర్తింపునకు జిల్లా స్థాయి కమిటీ

జిల్లా జాయింట్ కలెక్టర్ చిన్న రాముడు

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన పథకానికి లబ్ధిదారులను ఎంపిక చేయడానికి జిల్లా స్థాయిలో కమిటీని ఏర్పాటు చేసినట్లు జెసి ఎస్.చిన్న రాముడు తెలిపారు. జిల్లా కలెక్టరేట్ నుంచి సమన్వయ శాఖల అధికారులతో పిఎం మత్స్య సంపద యోజన పథకం, ఇతర పథకాలు అమలుపై వీడియో కాన్ఫరెన్స్‌ను శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జెసి చిన్నరాముడు మాట్లాడుతూ జిల్లా కమిటీలో చైర్‌పర్సన్‌గా కలెక్టర్, సెక్రటరీగా జిల్లా మత్స్య శాఖ అధికారి, సభ్యులుగా డ్వామా, డిఆర్‌డిఎ, భూగర్భ జలాలు, లీడ్ బ్యాంకు జిల్లా అధికారులు ఉంటారని తెలిపారు. జిల్లాలో ఉన్న మత్స్య కారులకు ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ప్రభుత్వ పథకాలు అమలు చేసేందుకు జిల్లాలోని అన్ని మండలాల్లో లబ్ధిదారులను గుర్తించాల్సి ఉందన్నారు. తూర్పు గోదావరి జిల్లాలో మత్స్యకారుల ఆదాయాన్ని పెంచడం, మత్స్య పరిశ్రమను అభివృద్ధి చేయడం, మత్స్య ఉత్పత్తిని పెంచడం కోసం సమర్థవంతమైన పనితీరు, కార్యాచరణ ప్రణాళిక అమలు చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారన్నారు. అందుకు సంబంధించి క్షేత్ర స్థాయిలో పరిశీలన చేసి, అర్హులైన లబ్ధిదారులను గుర్తించాలని అధికారులను ఆదేశించారు. మత్స్యకారులకు సంబంధించి వివిధ ప్రభుత్వ పథకాలతో కూడిన అర్హత కలిగిన లబ్ధిదారులు ప్రతిపాదనలు సిద్ధం చేసేందుకు కార్యాచరణను మార్గదర్శకాలను అనుసరించాల్సి ఉంటుందన్నారు. చిన్న నీటి పారుదల (మైనర్ ఇరిగేషన్) చెరువుల్లో చేప పిల్లల విడుదల, రీ సర్క్యులేటర్ ఆక్వా కల్చర్ సిస్టమ్స్, బయోఫ్లాక్ యూనిట్లు, మోటార్ సైకిల్ విత్ ఐస్ బాక్సులు, సైకిల్ విత్ ఐస్ బాక్సులు, లైవ్ ఫిష్ వెల్లింగ్ యూనిట్లు, పెద్ద రొయ్య చేప మేత తయారీ యూనిట్లు, మత్స్యకారులకు పడవలు, వలలు పథకాలకు అర్హత కలిగిన లబ్ధిదారులను గుర్తించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మత్స్య శాఖ జెడి ఎల్.ఎన్.నిర్మలాకుమారి, మత్స్య శాఖ ఎడి పి.శ్రీనివాసరావు, గ్రౌండ్ వాటర్ డిడి జి.రాధాకృష్ణ, డ్వామా పీడీ ఎం.నాగమల్లేశ్వరరావు, ఎల్‌డిఎం డివి.ప్రసాద్, డిఆర్‌డిఏ పీడీ ఎన్.మూర్తి తదితర అధికారులు పాల్గొన్నారు.

దాహార్తిని తీర్చుతున్న మజ్జిగ చలివేంద్రాలు

ప్రజాశక్తి - ఉంగ్రాజవరం

మండుతున్న ఎండల నుంచి, ఉపశమనం కల్పించేందుకు మండలంలోని గ్రామగ్రామాన ప్రధాన రహదారులపై మజ్జిగ చలివేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. వివిధ స్వచ్ఛంద సంస్థలు, సంఘాలు, ప్రయివేటు వ్యక్తుల సహకారంతో ఏర్పాటు చేస్తున్న ఈ చలివేంద్రాలు బాటసారుల దాహార్తిని తీరుస్తున్నాయి. ప్రభుత్వం తరఫున ఆడంబరంగా మండలంలో ప్రారంభించిన చలివేంద్రాలు నామమాత్రంగానే కనిపిస్తున్నప్పటికీ ప్రైవేటు వ్యక్తుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మజ్జిగ చలివేంద్రాలు ప్రజల దహార్తిని తీరుస్తున్నాయి. పాదచారులతో పాటు, ద్విచక్ర, భారీ వాహనాల ప్రయాణికులు ఆగి మజ్జిగ తాగడంతో పాటు, పలువురు బాటిల్స్‌లలో నింపుకొని వెళ్లడం కనిపిస్తోంది.



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న సిఐ రాంబాబు

మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు

ప్రజాశక్తి - నల్లజర్ల

మండలంలోని దూబచర్ల బస్టాండ్ వద్ద పార్డ్ ఇండియా స్వచ్ఛంద సేవా సంస్థ, లయన్స్ క్లబ్, వాసవి క్లబ్ దూబచర్ల ఆధ్వర్యంలో ఉచిత మజ్జిగ చలివేంద్రాన్ని నల్లజర్ల సిఐ వై.రాంబాబు, ఎస్‌ఐ కె.రమేష్ శుక్రవారం ప్రారంభించారు. స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్ (సాప్) తూర్పుగోదావరి విభాగం సహకారంతో సంఘమిత్ర విద్యాలయంలో ఉచిత యోగా, చెస్, వాలీబాల్ వేసవి శిక్షణ శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సిఐ రాంబాబు మాట్లాడుతూ స్వచ్ఛంద సంస్థలు, వివిధ క్లబ్‌లు అందిసుతన్న సేవలు అభినందనీయమన్నారు. వేసవి సెలవుల్లో పిల్లల అభివృద్ధికి తల్లిదండ్రులు శిక్షణా శిబిరాలకు వెళ్లేలాప్రోత్సహించాలన్నారు. ఈ సందర్భంగా యోగా మిత్ర రాజారావు, శిబిర నిర్వాహకుడు అంబటి శ్రీనివాసరావును సిఐ అభినందించారు. అనంతరం పలువురు సంస్థల ప్రతినిధులు సిఐ, ఎస్‌ఐలను సత్కరించారు. ఈ కార్యక్రమంలో దూబచర్ల సర్పంచ్ తాడిగడప బాలయ్య, ఉపసర్పంచ్ కాసాని బాలగంగాధర్, లయన్స్ క్లబ్ అధ్యక్షులు కెల్లా వాసు, చీమకుర్తి కష్ణ ప్రసాద్, జీవివి ప్రసాద్, మైనం వెంకటేశ్వరరావు(సింహ), జామి రాంబాబు, చిప్పాడ కుమార్, కెల్లా వంశీకృష్ణ పాల్గొన్నారు.

రబీలో 2,38,767 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

జిల్లాలోని రబీ సీజన్‌లో 206 రైతు సేవా కేంద్రాల్లో 20,692 మంది రైతుల నుంచి 31,349 ఎఫ్‌టిఒల 2,38,767 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ చేశామని జాయింట్ కలెక్టర్ ఎస్.చిన్నరాముడు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 31,349 ఎఫ్‌టిఒలకు ఇప్పటి వరకు 22,025 ఎఫ్‌టిఒలకు చెందిన రూ.400.76 కోట్లను రైతుల బ్యాంకు ఖాతాలకు జమ చేసినట్టు తెలిపారు. ఈ నెల 2వ తేదీన 1,262 మంది రైతుల నుంచి 2,323 ఎఫ్‌టిఒల ద్వారా 14,302.64 మెట్రిక్ టన్నుల ధాన్యం రైతుల నుంచి కొనుగోలు చేశామన్నారు. జిల్లా వ్యాప్తంగా 216 రైతు సేవా కేంద్రాలను ఏర్పాటు చేయగా 206 రైతు సేవా కేంద్రాల్లో రబీ సీజన్ ఆయా ప్రాంతాల్లో నూర్పిడి(ధాన్యం కోతలు) అనుసరించి కొనుగోలు చేపట్టామన్నారు. లక్ష్యాలను పూర్తి చేసినా, ఆయా మండలాల్లో కోతలు అనుసరించి కొనుగోళ్ల లక్ష్యాలను పెంచుతామన్నారు. 2,38,766.800 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణకు సంబంధించి రూ.549.64 కోట్లకు రూ.400 కోట్ల 76 లక్షలు జమ చేశామన్నారు.మిగిలిన ధాన్యాన్ని సేకరించేందుకు అన్ని చర్యలూ తీసుకున్నామని ఆయన తెలిపారు.

తిరుమల పూర్వ విద్యార్థికి సివిల్స్‌లో ర్యాంకు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం



సివిల్స్ ర్యాంకర్ వినయ్‌ను సత్కరిస్తున్న తిరుమలరావు తదితరులు

రాజమహేంద్రవరం రూరల్ కాతేరులోని తమ తిరుమల విద్యాసంస్థలో చదువుకున్న దొమ్మేటి వినయ్ సివిల్స్‌లో ఆలిండియా 274వ ర్యాంకు సాధించాడని తిరుమల విద్యాసంస్థల ఛైర్మన్ నున్న తిరుమలరావు తెలిపారు. వినయ్ తన తల్లిదండ్రులు జగదీష్, కనకదుర్గ, సోదరుడు సాయి సంతోష్‌లతో కలిసి శుక్రవారం క్యాంపస్‌కు విచ్చేశారు. ఈ సందర్భంగా తిరుమలరావు వినయ్‌కు పుష్పగుచ్ఛం ఇచ్చి, దుశ్శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా తిరుమలరావు మాట్లాడుతూ వినయ్ ఇంటర్ తమ విద్యాసంస్థల్లో చదివాడన్నారు. ఎన్‌ఐటి దుర్గాపూర్లో ఇంజినీరింగ్ సీటు సాధించాడని, బిటెక్ చదివిన తరువాత యుపిఎస్‌సి పరీక్ష రాసి ర్యాంకు సాధించాడన్నారు. ఈ సందర్భం వినయ్ మాట్లాడుతూ తనకు ఈ ర్యాంకు రావడానికి ఇంటర్మీడియట్ తిరుమలలో చదువుతున్నప్పుడు తిరుమలరావు ఇచ్చిన కౌన్సెలింగ్, క్యాంపస్‌లో చెప్పే విలువలతో కూడిన విద్య ఎంతగానో ఉపయోగపడ్డాయన్నారు. తనకు వచ్చిన ఈ ర్యాంకుకు ఐఆర్‌ఎస్, కస్టమ్స్ రావొచ్చన్నారు. సివిల్స్‌లో మరో ప్రయత్నం చేసి కలెక్టర్ కావాలనేది తన లక్ష్యమన్నారు. ఈ సందర్భంగా తిరుమల విద్యాసంస్థల అకడమిక్ డైరెక్టర్ జి.సతీష్ బాబు, ప్రిన్సిపల్ వి.శ్రీహరి, సిబ్బంది దొమ్మేటి తదితరులు వినయ్‌ను అభినందించారు.

కృష్ణమోహన్ సేవలు స్ఫూర్తిదాయకం

ప్రజాశక్తి-కడియం

ఎక్కడ పని చేసినా ఏ హోదాలో ఉన్నా అక్కడ ప్రజలు, నాయకులు, ప్రజా ప్రతినిధులు, అధికారులు మన్ననలు అందుకొని అందరివాడిగా పేరు తెచ్చుకున్న కృష్ణమోహన్ సేవలు ప్రభుత్వ ఉద్యోగులందరికీ ఆదర్శమని ఎంపిపి వెలుగుబంటి ప్రసాద్ అన్నారు. మాధవ రాయుడుపాలెం గ్రామంలో గ్రేడ్ వన్ కార్యదర్శిగా పనిచేస్తూ ఉద్యోగ విరమణ పొందిన తురగా కృష్ణమోహన్ ఉద్యోగ విరమణ సభ కడియం మండల పరిషత్ కార్యాలయంలో జరిగింది. ఎంపిడిఒ రమేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కృష్ణమోహన్ దంపతులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మాధవ రాయుడుపాలెం సర్పంచ్ అన్నందేవుల చంటి, జేగురుపాడు సర్పంచ్ యాదల సతీష్‌చంద్రస్టాలిన్, డిఎల్‌డిఒ కె.రత్నకుమారి, డిడిఒ కె.కిషోర్, చిలుకూరు శ్రీనివాసరావు, సావరం మాజీ సర్పంచులు సాపిరెడ్డి సూరిబాబు, తుమ్మెద వరహాల రాజు, ఎంపిటిసి మాజీ సభ్యులు రావిపాటి రామకృష్ణ, పలువురు నాయకులు పాల్గొన్నారు.



దాచూరి సేవలు వెలకట్టలేనివి

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం ప్రతినిధి

ఉమ్మడి రాష్ట్రంలో ఉపాధ్యాయ ఉద్యమాన్ని బలోపేతం చేసి తద్వారా ప్రభుత్వ పాఠశాలకు బాసటగా నిలిచిన దాచూరి రాంరెడ్డి సేవలు వెలకట్టలేనివని యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.జయకర్, ఎ.షరీఫ్ అన్నారు. యుటిఎఫ్ ఉద్యమ నిర్మాతల్లో ఒకరైన దాచూరి తొమ్మిదో వర్ధంతిని శుక్రవారం రాజమహేంద్రవరంలోఒని యుటిఎఫ్ హోమ్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా దాచూరి చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెండు సార్లు ఉపాధ్యాయ ఎంఎల్‌సిగా పనిచేసి టీచర్ల అభ్యున్నతికి, వారి సమస్యలు తీర్చడానికి రామిరెడ్డి ఎంతో కృషి చేశారన్నారు. యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎన్.అరుణకుమారి మాట్లాడుతూ సంఘ నిర్మాణం కోసం తన 16 ఏళ్ల సర్వీసును వదులుకున్న త్యాగధనుడు రామిరెడ్డి అని కొనియాడారు. సుదీర్ఘ కాలం సంఘ రాష్ట్ర అధ్యక్షునిగా పనిచేసి సంఘాన్ని ఎంతో బలోపేతం చేశారన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కె.విజయగౌరీ, కార్యదర్శులు కె.రమేష్, చిలుకూరి శ్రీనివాసరావు, సిహెచ్.దయానిధి, వర్మ, ఎం.శ్రీనివాస్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రూపస్‌రావు, యుటిఎఫ్ బాధ్యులు శ్రీనివాసరావు, విజయ్ పాల్గొన్నారు.

యర్నగూడెం మహిళకు గిన్నిస్‌లో చోటు

ప్రజాశక్తి -దేవరపల్లి


దేవరపల్లి మండలం యర్నగూడెం గ్రామానికి చెందిన నల్లం తులసీమణి సంగీతానికి సంబంధించి స్వరళీ స్వరాలను కీబోర్డ్‌పై పలికించి గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్‌లో స్థానం సాధించారు. విజయవాడకు చెందిన హల్లెల్ మ్యూజిక్ స్కూల్ వ్యవస్థాపకులు పాస్టర్ అగస్టీన్ దండంగి సారథ్యంలో 2024 డిసెంబర్ 1న 18 దేశాలకు చెందిన 1046 మంది కళాకారులు ఎలక్ట్రానిక్ కీబోర్డు ద్వారా 40 సెకన్లలో సప్త స్వరాలను ప్లేచేసి ఇన్స్‌ట్రాగ్రామ్‌లో ఒక గంటలో అప్లోడ్ చేయడం ఇదే మొదటి సారి అని గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ అడ్జుడికేటర్ రిచ్ స్టీఫెన్ రిచర్డ్ సన్ ప్రకటించారు. ఈ సందర్భంగా విజయవాడ మెట్రోపాలిటన్ మిషన్ చర్చిలో గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ ధ్రువపత్రాన్ని మెడల్‌ను తులసీమణి అందుకున్నారు. తన విజయానికి భర్త నాగేంద్ర కుమార్ ప్రోత్సాహమే కారణమని తెలిపారు. ఈ సంరద్భంగా పలువురు ఆమెకు అభినందనలు తెలుపుతున్నారు.

సేవా కార్యక్రమాలకు ముందడుగు వేయాలి

ప్రజాశక్తి-తాళ్లపూడి

మెప్పు కోసం కాకుండా ప్రజలకు అవసరమైన సేవా కార్యక్రమాలు అందించడానికి ముందడుగు వేయాలని ఎంపిపి జొన్నకోటి పోసిరాజు సూచించారు. సామాజిక, సేవా కార్యక్రమాలు ప్రజలకు అందించేందుకు తాళ్లపూడి మండల వైసిపి దళిత జెఎసిని శుక్రవారం నూతనంగా ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంపిపితో పాటు పలువురు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. సామాజిక సేవా కార్యక్రమాలపై నూతన కమిటీకి దిశా నిర్దేశం చేశారు. పలు గ్రామాల నుంచి వచ్చిన దళితుల సమక్షంలో జరిగిన ఈ సమావేశంలో జెఎసి నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జెఎసి గౌరవ అధ్యక్షులుగా తాళ్లపూడి ఎంపిపి జొన్నకూటి పోసిరాజు, గజ్జరం ఎంపిటిసి సభ్యులు జి.చిన్నబ్బాయి, అధ్యక్షులుగా ప్రక్కిలంకకు చెందిన యాళ్ల బాబూరావు, ఉపాధ్యక్షులుగా ఎన్.సురేష్, కార్యదర్శిగా పిట్టా శ్రీనివాస్, సహాయ కార్యదర్శిగా కొల్లి దుర్గారావు, కోశాధికారిగా ఎస్.గంగారావు, సహాయ కోశాధికారిగా పి.రాంకీ, మహిళా అధ్యక్షురాలిగా పి.సత్యవతి, ఉపాధ్యక్షురాలిగా ఎం.దమయంతి, కార్యవర్గ సభ్యులుగా మరో 23 మంది ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. నూతనంగా ఏర్పడిన కమిటీ కార్యవర్గాన్ని ఘనంగా సత్కరించారు.

కార్టూ'నిజం'



అధికారుల అవినీతి దాహం..

కిశోర బాలికలకు అవగాహనా సదస్సు

ప్రజాశక్తి -గోకవరం



ఉంగ్రాజవరంలో అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీలు, ఐసిడిఎస్ సిబ్బంది

మండలంలోని రంప యర్రంపాలెం సచివాలయంలో ఐసిడిఎస్ సూపర్‌వైజర్ ఎల్.రంజిని ఆధ్వర్యంలో శుక్రవారం కిశోరబాలికలకు అవగాహనా సదస్సును నిర్వహించారు. వేసవి తరగతుల్లో భాగంగా ఈ అవగాహనా సదస్సు నిర్వహించామన్నారు. బాల్య వివాహాల నిర్మూలన, చిన్న వయసులో వివాహాల వల్ల ఉత్పన్నమయ్యే సమస్యలు, బాలికల హక్కులు వంటివాటిపై అవగాహన కల్పించామన్నారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు బాదంపూడి ప్రకాష్, పంచాయతీ సెక్రెటరీ గోవిందు, ఎంఎస్‌కె.వాసవి, అంగన్‌వాడీలు టి.బొజ్జమ్మ, కె.కృష్ణవేణి, కె.మైథిలి, జి.అమ్మాణీ, ఎఎన్‌ఎం విశ్వనాథం విఒఎలు పాల్గొన్నారు.

ఉంగ్రాజవరం : బాల్య వివాహాల నిర్మూలనపై శుక్రవారం మండలంలోని పలు గ్రామాల్లో ఐసిడిఎస్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. బాల్య వివాహాల నిర్మూలన, పర్యవేక్షణ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పలువురు మాట్లాడారు. బాలికలు విద్యకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలను వివరించారు. మోర్తలో కిశోరి వికాసం, వేసవి తరగతులు నిర్వహణలో భాగంగా చిన్నారులకు పలు విషయాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్‌వైజర్ భాగ్యలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి పిల్లి ముసలయ్య, కమిటీ సభ్యులు నిమ్మన కృష్ణమూర్తి, మోటుపల్లి సూర్యకుమారి, అంగన్‌డీ కార్యకర్తలు, వైద్య సిబ్బంది, తల్లులు, బాలికలు పాల్గొన్నారు.

పెన్షనర్స్ సంఘ అధ్యక్షులుగా ధర్మరాజు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నమెంట్ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్(ఎపిఎస్‌జిఆర్‌ఇఎ) అధ్యక్షులుగా యర్రమోతు ధర్మరాజు ఎన్నికయ్యారు. ధవళేశ్వరం యూనిట్ నూతన కార్యవర్గం ఎన్నిక శుక్రవారం సంఘం జిల్లా అధ్యక్షులు పల్లా సత్యనారాయణమూర్తి పర్యవేక్షణలో జరిగింది. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగులు పలు సమస్యలు ఎదుర్కొంటున్నారని తెలిపారు. అవసరమైతే ప్రభుత్వంపై పోరాటానికి సన్నద్ధమవ్వాలన్నారు. పటిష్టమైన కమిటీ ఎన్ను కోవాలని సత్యనారాయణ మూర్తి సూచించారు, అధ్యక్షులుగా యర్రమోతు ధర్మరాజు, ప్రధాన కార్యదర్శిగా బి.దువ్వూరి కామేశ్వర శర్మ, కోశాధికారిగా ఉర్రింకల సత్యనారాయణ, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా దాసరి సాయిబాబా, టి.కేశవరావు, ఉపాధ్యక్షులుగా బి.శీరంగం వెంకటేశ్వర్లు, కె.రామారావు, కొండా సూర్యనారాయణ, బుగ్గా సత్యసుబ్రహ్మణ్యం, కార్యనిర్వాహక కార్యదర్శిగా బిఎన్.విజయమోహన్, సంయుక్త కార్యదర్శిగా అంజూరి సూర్యారావు, కొంజర్ల వెంకటరత్నం, సిహెచ్.నరసింహారావు, జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా అరవ సత్యనారాయణమూర్తిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు, అధ్యక్షులు యర్రమోతు ధర్మరాజు మాట్లాడుతూ పన్నెండు ఏళ్లుగా ఈ సంఘంలో పనిచేశానని, సంఘ సభ్యులకు ఎటువంటి ఇబ్బందులు ఏర్పడినా అందరి సహకారంతో పరిష్కారం చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అసోసియేట్ ప్రెసిడెంట్ పెయ్యాల సత్య ప్రసాదరావు పాల్గొన్నారు. తొలుత పహల్గామ్ మృతులకు సంతాపం తెలిపారు. రెండు నిమిషాలు మౌనం పాటించారు,

ఎపిలో పింఛను విధానం దేశానికే ఆదర్శం

ప్రజాశక్తి-గోకవరం

ఆంధ్రప్రదేశ్‌లో జరుగుతున్న పెన్షన్ విధానం దేశానికే ఆదర్శమని టిడిపి మండల కన్వీనర్ మంగరౌతు రామకృష్ణ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెన్షన్ పొందుతున్న భర్త చనిపోతే అతని పింఛను వితంతు పెన్షన్‌గా మార్పు చేసి మరుసటి నెలలోనే లబ్ధిదారులకు అదించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. ఇందులో భాగంగా శుక్రవారం గోకవరం పంచాయతీ సెక్రెటరీ శిరీష ఆధ్వర్యంలో కర్రి రాజేశ్వరి, శీర్ల అనసూయ చింతాటి శకుంతల, మచ్చా వెంకటలక్ష్మిలకు పింఛన్లను అదించామన్నారు. రూ.200 పింఛనును రూ.2వేలకు చేసింది చంద్రబాబు నాయుడేనన్నారు. వైసిపి హయాంలో పెన్షనుదారులు దగాపడ్డారన్నారు. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ సూపర్ 6లో భాగంగా రూ.3వేల పింఛను రూ.4వేలు చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

పేకాట శిబిరంపై దాడి

ప్రజాశక్తి - ఆత్రేయపురం

మండలంలోని నార్కెడిమిల్లి పాలెం గ్రామం శివారున శుక్రవారం పేకాడుతున్నారన్న విశ్వసనీయ సమాచార మేరకు ఎస్ఐ ఎస్.రాము తన సిబ్బందితో పేకాట శిబిరంపై దాడులు నిర్వహించారు. అయిదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని వారి వద్ద నుండి రూ.22,500 నగదును స్వాధీనపరచుకొని వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

రైలు నుంచి జారిపడి వ్యక్తి మృతి

ప్రజాశక్తి-తుని

తుని-గుల్లిపాడు రైల్వేస్టేషన్ల మధ్య పిఎల్.లక్ష్మీపురం రైల్వే ట్రాక్ వద్ద శుక్రవారం రైలు బండి నుంచి జారిపడి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినటుట్ల తుని రైల్వే ఎస్ఐ జి.శ్రీనివాస్ తెలిపారు. రాజమండ్రి నుంచి విశాఖపట్నం వెళుతున్న రైలు నుంచి 35 ఏళ్ల వయసు గల గుర్తు తెలియని వ్యక్తి జారిపడి మరణించాడని తెలిపారు. మృతుని వివరాలు తెలియవలసిందని ఉందని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

ప్రజాశక్తి- తాళ్లరేవు

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి శుక్రవారం మృతి చెందాడు. గాడిమొగ రహదారిలో తిమ్మరాజపురం జంక్షన్ వద్ద ఉన్న స్పీడ్ బ్రేకర్ వద్ద బైకు పైనుంచి పడి గాయాలైన వైదాడి వీర్రాజు (59) కాకినాడలో జిజిహెచ్‌లో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో మరణించాడు. ఈ సెంటర్లో ఉన్న స్పీడ్ బ్రేకర్ వల్ల ఇటీవల పలు ప్రమాదాలు జరుగుతున్నాయి. స్పీడ్ బ్రేకర్‌పై జీబ్రా లైన్స్ లేకపోవడం వల్ల ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయని, ఇప్పటికైనా స్పీడ్ బ్రేకర్‌పై తెలుపు రంగు జీబ్రా లైన్స్ వేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

పిఎం సభకు వెళ్లి వస్తుండగా రోడ్డు ప్రమాదంలో ఉద్యోగి దుర్మరణం

ప్రజాశక్తి - ఉంగుటూరు

అమరాతి రాజధాని పున:నిర్మాణ సభకు వెళ్లి తిరిగి వస్తుండగా ఏలూరు జిల్లా ఉంగుటూరు మండలం కైకరం వద్ద చోటు చేసుకున్న రోడ్డు ప్రమాదంలో డ్వాక్రా హెచ్ఆర్ సీసీ దేవళ్లతిమ్మల్ల నాగరాజు (48) దుర్మరణం చెందారు. బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా రాజోలు నియోజకవర్గం మలికిపురం మండలంలో డిఆర్‌డిఎలో హెచ్ఆర్ సీసీగా నాగరాజు ఉద్యోగ విధులు నిర్వహిస్తున్నారు. కడప జిల్లాకు చెందిన నాగరాజు ఉద్యోగ రీత్యా మలికిపురంలో భార్య పిల్లలతో ఉంటున్నారు. ఈ క్రమంలో అమరావతిలో మోడీ సభకు జనాలను బస్సుల్లో తరలించేందుకు నాగరాజుకు డ్యూటీ వేశారు. ఈ నేపథ్యంలో 35 మందితో బస్సు శుక్రవారం ఉదయం అమరావతి వెళ్లింది. అయితే ట్రాఫిక్ కారణంగా బస్సును పోలీసులు సభవేదిక సమీపంలోకి రానీయకపోవడంతో బస్సు తిరిగి మలికిపురం బయలు దేరింది. ఈ క్రమంలో ఉంగుటూరు మండలం కైకరం వద్ద టీ కోసం బస్సు ఆగింది. మూత్ర విసర్జన కోసం నాగరాజు రోడ్డు దాటుతుండగా తాడేపల్లిగూడెం నుంచి ఏలూరు వైపు వెళ్తున్న కోళ్ల లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో తలకు తీవ్ర గాయాలై అపస్మాక స్థితిలోకి వెళ్లిన నాగరాజును హైవే అంబులెన్సులో ఆశ్రం ఆసుపత్రికి తరలించారు. అక్కడ నుంచి ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే నాగరాజు మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. చేబ్రోలు ఎస్ఐ సూర్య భగవాన్ కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతుడు నాగరాజుకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఆయన మృతికి ఉంగుటూరు వెలుగు ఎపిఎం ప్రభావతి సంతాపం వ్యక్తం చేశారు.

వివాహిత ఆత్మహత్య

ప్రజాశక్తి - పెద్దాపురం

తూర్పు పాకల గ్రామానికి చెందిన వివాహిత అబ్బిరెడ్డి హర్షిత (21) శుక్రవారం ఉరేసుకుని మరణించిందని పోలీసులు తెలిపారు. సిఐ కృష్ణ భగవాన్, ఎస్ఐ వి.మౌనిక సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. తామరాడకు చెందిన హర్షిత కుటుంబ సభ్యులు తమ కుమార్తెను అత్తింటి వారే హింసించి చంపేశారని ఆరోపించారు. మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం పెద్దాపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనుమానాస్పద మతిగా కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ మౌనిక తెలిపారు.

ఇళ్లను కూల్చడం తగదు

ప్రజాశక్తి - కపిలేశ్వరపురం

వల్లూరు చెరువు గట్టు పై నాలుగు దశాబ్దాలుగా నివసిస్తున్న బిసి సామాజిక వర్గానికి చెందిన సుమారు 23 కుటుంబాల గృహాలను జేసీబీలతో ఇటీవల కూల్చివేయడాన్ని తగదని బిసి ప్రజా సంక్షేమ సంఘం నాయకులు అన్నారు. గృహాలు కూల్చివేయడాన్ని బిసి ప్రజా సంక్షేమ సంఘం తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు శుక్రవారం వల్లూరులో సంఘం జాతీయ అధ్యక్షుడు గూడూరు వెంకటేశ్వరరావు విలేకరుల సమావేశంలో సంఘటనపై తీవ్ర విమర్శలు చేశారు. పంచాయతీ సిబ్బంది, పోలీస్ భద్రత మద్దతుతో నివాస గహాలను తొలగించిన బాధితులకు ఎలాంటి ప్రత్యామ్నాయం చూపించకపోవడం దారణమన్నారు. ఇలాంటి బిసి వ్యతిరేక విధానాలకు పాల్పడితే గ్రామ బీసీ ప్రజలకు , రాష్ట్ర బీసీ నాయకులు అంతా వచ్చి మద్దతు తెలుపుతామన్నారు. చెరువు చుట్టూ ఆక్రమణాలను కూడా తొలగిస్తామని నోటీసులు జారీ చేయడం విచారకరమన్నారు. ఇటీవల మాచర గ్రామంలో చెరువు గట్టు వద్దే ఒసిసామాజిక వర్గానికి చెందిన కళ్యాణ మండపానికి స్థానిక ఎంఎల్ఎ శంకుస్థాపన చేసిన విషయాన్ని ప్రస్తావిస్తూ అక్కడొక న్యాయమా ఇక్కడొక న్యాయమా అని విమర్శించారు. ఈ సమావేశంలో బిసి నాయకులు బి.భాస్కరరావు, బిసి నాయకులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన

ప్రజాశక్తి - కె.గంగవరం

సీజనల్ వ్యాధులపట్ల ప్రజలకు వైద్య సిబ్బంది అందరూ అవగాహన కల్పించాలని జిల్లా మలేరియా అధికారి నక్క వెంకటేశ్వరావు సూచించారు. పేకేరు ఆరోగ్య కేంద్రాన్ని ఆయన శుక్రవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ వేక్టర్ బోర్న్ వ్యాధులు పట్ల ప్రజలకు తెలియజేయాలని సూచించారు. అనంతరం ల్యాబ్ రికార్డ్స్ తనిఖీ చేసి పలు సూచనలు చేశారు. జ్వరాల సర్వే వివరాలను డాక్టర్ మరి శ్రీ లక్ష్మిని అడిగి తెలుసుకొన్నారు. అయన వెంట యూనిట్ ఆఫీసర్ సత్యనారాయణ, మూర్తి తదితరులుఉన్నారు.

మూడు నెలలుగా కందిపప్పు కట్

బియ్యం, పంచదారకే పరిమితమైన చౌక ధరల దుకాణాలు

ప్రజాశక్తి - రామచంద్రపురం

ప్రభుత్వ చౌక ధరల దుకాణాల ద్వారా సామాన్యులకు అందించే నిత్యావసర సరుకులు అంతంత మాత్రమే అందుతున్నాయి. బయట మార్కెట్లో అధిక ధరలకు నిత్యవసర సరుకులు కొనుగోలు చేయలేని సామాన్యులకు తెల్ల రేషన్ కార్డులు మంజూరు చేసి తద్వారా బియ్యం, పప్పులు, నూనె, ఇతర నిత్యావసర వస్తువులను ప్రభుత్వం తక్కువ ధరకు సరఫరా చేసేది. రాను రాను చౌక ధరల దుకాణాలను నిర్వీర్యం చేశారు. జనవరి ముందు వరకు కందిపప్పు, బియ్యం, అరకేజీ పంచదార చౌక ధరల దుకాణాల ద్వారా సరఫరా అయ్యేవి. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో సుమారు 12 రకాలు సరుకులు నిత్యావసర వస్తువులు చౌక ధరలు దుకాణాల ద్వారా పంపిణీ చేసింది. ప్రస్తుతం ఇస్తున్న మూడు సరుకుల లోను మూడు నెలలుగా కందిపప్పును కట్ చేశారు. బహిరంగ మార్కెట్లో కందిపప్పు ధర రూ.150 పలుకుతోంది. దీన్ని చౌక ధరల దుకాణాలు ద్వారా రూ.67 కు అందించేవారు. ప్రస్తుతం కందిపప్పు అందకపోవడంతో సామాన్యులు బయట పెరిగిన ధరతో కందిపప్పు కొనేందుకు భయపడుతున్నారు. రామచంద్రపురం మండలంలో 57 రేషన్ దుకాణాలు ఉన్నాయి. అదేవిధంగా కె.గంగవరం మండలంలో 45 రేషన్ దుకాణాలు ఉన్నాయి. సుమారు 20 వేల వరకు తెల్ల రేషన్ కార్డులు ఉన్నాయి. వీరందరికీ గత మూడు నెలలుగా కేవలం బియ్యం, అర కేజీ పంచదార మాత్రమే రేషన్ దుకాణాల ద్వారా సరఫరా అవుతున్నాయి. దీనిపై ప్రభుత్వం ఆలోచించి నిరుపేదలకు అవసరమైన నిత్యావసర వస్తువులు పప్పులు, వంట నూనెలు, చిరుధాన్యాలు, ఇతర వస్తువులను తక్కువ ధరలకు పేదలకు అందించాలని గత మూడు నెలలుగా నిలిపివేసిన కందిపప్పు తిరిగి పునరుద్ధరించాలని రామచంద్రపురం నియోజకవర్గంలోని ప్రజలు అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు.

ప్రభుత్వమే కందిపప్పు విడుదల చేయాల్సి ఉంది : తహశీల్దార్

రామచంద్రపురం నియోజకవర్గంలో మూడు నెలలుగా రేషన్ దుకాణాలకు కందిపప్పు సరఫరా నిలిచిపోయిందని రామచంద్రపురం, కె.గంగవరం మండలం తహశీల్దార్ బండి మృత్యుంజయరావును ప్రజాశక్తి వివరణ కోరగా.. ప్రభుత్వం నుంచే సరుకు విడుదల కావాల్సి ఉందని ఆయన తెలిపారు. విషయాన్ని జిల్లా సివిల్ సప్లై అధికారులు దృష్టికి తీసుకు వెళ్లామన్నారు. ప్రస్తుతం అంతా ఆన్లైన్లోనే సరుకులు సరఫరా అవుతున్నాయని, స్టాకు వచ్చిన వెంటనే చౌక ధరల దుకాణాలకు పంపించడం జరుగుతుందని ప్రస్తుతం గొడౌన్ లలో స్టాక్ లేదని వివరించారు.



బియ్యం పంపిణీ చేస్తున్న మొబైల్ రేషన్ షాప్



పి.గన్నవరం లో మేడే వేడుకలలో ఎంఎల్ఎ గిడ్డి సత్యనారాయణ

కొబ్బరి ఒలుపు కార్మికులను ఆదుకుంటాం

ప్రజాశక్తి - పి.గన్నవరం

కొబ్బరి ఒలుపు కార్మికులను ప్రభుత్వపరంగా ఆదుకుని అండగా ఉంటామని పి.గన్నవరం ఎంఎల్ఎ గిడ్డి సత్యనారాయణ అన్నారు. మేడే సందర్భంగా పి.గన్నవరంలో నిర్వహించిన కొబ్బరి ఒలుపు కార్మికుల ప్రత్యేక కార్యక్రమంలో పి.గన్నవరం ఎంఎల్ఎ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. శ్రమ దినోత్సవం మే డే సందర్భంగా కొబ్బరి తోటల్లో కష్టపడి పనిచేసే కార్మికులతో కలిసి మే డే వేడుకలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఎంఎల్ఎ గిడ్డి మాట్లాడుతూ శ్రమకు గౌరవం నివ్వాలని, కార్మికుల హక్కులు పరిరక్షించాలనే సంకల్పాన్ని పునరుద్ఘాటించారు. కార్మికుల అభివృద్ధే గ్రామీణాభివృద్ధికి పునాది' అని ఎంఎల్ఎ పేర్కొన్నారు. కార్మికుల సంక్షేమానికి అవసరమైన సహకారాన్ని ప్రభుత్వం ద్వారా అందించేందుకు కషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో స్థానిక కొబ్బరి ఒలుపు కార్మికులు, రైతులు, ప్రజా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. కార్మికుల శ్రమకు ఎమెల్యే ప్రత్యేకంగా సత్కరించారు.ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, కార్మికులు పాల్గొన్నారు.

ముంగండ లో ఘనంగా మేడే వేడుకల

ముంగండ గ్రామంలో సిపిఐ గ్రామ ప్రధాన కార్యదర్శి విత్తనాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో కార్మిక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సర్పంచ్ కుసుమ చంద్రకళ వెంకటేశ్వరరావు, మాజీ ఎంపిపి అంబటి భూలక్ష్మి, కోటేశ్వరరావు మాట్లాడుతూ ప్రపంచమంతా ఐక్యంగా జరుపుకునే పండగ మేడే అన్నారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ పెచ్చెట్టి వెర్రియ్య పి. గన్నవరం మండల కార్యదర్శి తుమ్మలపల్లి చంద్రబాబు నేలపూడి రామకష్ణ తవిటికి నాగరాజు కె.ప్రసాద్ భవన నిర్మాణ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కోచింగ్ సెంటర్ ప్రారంభం

ప్రజాశక్తి - అమలాపురం రూరల్

రిడీమింగ్ కమ్యూనిటీస్ అధినేత డాక్టర్ మనోహర్ జేమ్స్ ఆధ్వర్యంలో శుక్రవారం అమలాపురం మండలం వన్నె చింతలపూడి లో 1 నుంచి 10వ తరగతి వరకు క్రిస్టినా ఉచిత కోచింగ్ సెంటర్ ను పి.జ్యోతి బాయి, బి.కమల, రత్నరాజు దంపతులచే ప్రారంభమైంది. ఈ కార్యక్రమంలో రిడీమింగ్ కమ్యూనిటీస్ ఎపి ప్రెసిడెంట్ బి.డేనియల్ కెనడీ, ట్రెజరర్ పి.బుజ్జి బాబు తదితరులు పాల్గొన్నారు.



బస్సు ప్రారంబిస్తున్న అంబాజీపేట ఎంపిడిఒ జివి.సరోవరరావు

అమరావతికి తరలిన శ్రేణులు

ప్రజాశక్తి - అంబాజీపేట

అంబాజీపేట మండలం నుంచి అమరావతి రాజధాని శంకుస్థాపన సందర్భంగా శుక్రవారం నిర్వహించిన ప్రధానమంత్రి బహిరంగ సభకు మూడు బస్సులలో 138 మంది తరలివెళ్లారని ఎంపిడిఒ జివి.సరోవరరావు తరలివెళ్లారు. మూడు బస్సులకు ముగ్గురు చొప్పున ఇసుకపూడి, తొండవరం, పసుపల్లి సెక్రటరీలు టిఎస్‌డి.ప్రసాద్, ఎమ్.లోవబాబు, ఎల్.గణేశ్వరరావులు, మహిళా పోలీసులు ఆర్ఎన్ఎల్.భవాని, టి.శిరీష, కె.శ్రీదుర్గలు, ఎమ్‌పిహెచ్‌డబ్ల్యు(ఎమ్)ల పర్యవేక్షణలో మండలం నుండి డ్వాక్రా యానిమేటర్లు, ఉపాధి హామీ కూలీలు తదితరులకు టిఫిన్, భోజన సదుపాయాలు తాగునీరు సమకూర్చామన్నారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ ఎఒ ఎపిఎల్.నరసింహం, సీనియర్ అసిస్టెంట్ వివి.గిరిబాబు, పంచాయతీ కార్యదర్శులు, కెవివి.సత్యనారాయణ, డి.లక్ష్మీపతి, మండల పరిషత్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. **రావులపాలెం:** రాజధాని అమరావతిలో జరిగిన కార్యక్రమానికి మండలంలోని టిడిపి శ్రేణులు తరలివెళ్లారు. మండల కేంద్రం రావులపాలెం నుంచి శుక్రవారం బస్సులు, కార్లలో పార్టీ శ్రేణులు భారీగా తరలి వెళ్లారు. పార్టీ శ్రేణులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు టిడిపి నాయకులు తగిన ఏర్పాట్లు చేసారు.

ఆసుపత్రికి వెళ్లి పింఛను అందజేత

ప్రజాశక్తి - ఉప్పలగుప్తం

గోపవరం కు చెందిన ఆకుల రామదాసు అనారోగ్యంతో అమలాపురం కిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. రామదాసు వృద్ధాప్యపు పింఛన్ లబ్ధిదారుడు. రామదాసు ఇంటి వద్ద లేకపోవడం రెండో రోజు పింఛన్ తీసుకోకపోతే వచ్చే నెల వరకు ఆగవలసి వస్తుందని ఆసుపత్రిలో వైద్య చికిత్స అవసరాలకు పింఛన్ సొమ్ము ఉపయోగపడుతుందన్న ఆలోచనతో శుక్రవారం సచివాలయ సిబ్బంది బడుగు సుమ, ఆకేటి మధు పార్వతి లు కిమ్స్ ఆసుపత్రికి వెళ్లి రామదాసు కు పింఛన్ సొమ్ము అందజేశారు. పింఛన్ అందించిన సుమ, మధు పార్వతీలకు ఈ సందర్భంగా రామదాసు కృతజ్ఞతలు తెలిపాడు. అలాగే ఆసుపత్రికి వెళ్లి పింఛన్ అందజేసిన సుమ, మధు పార్వతిలను సర్పంచ్ కుంచే బుల్లియ్య, పంచాయతీ కార్యదర్శి డి.బాల బాలాజీ లు అభినందించారు.

లబ్ధిదారులకు పింఛన్లు మంజూరు చేయాలి

ప్రజాశక్తి - మండపేట

లబ్ధిదారులకు పూర్తిస్థాయిలో పెన్షన్లు మంజూరు చేయాలని మండపేట నియోజకవర్గ వైసిపి ఇన్‌ఛార్జి, ఎంఎల్‌సి తోట త్రిమూర్తులు పేర్కొన్నారు. శుక్రవారం మండపేట వైసిపి పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు.. వికలాంగులకు రీ-వెరిఫికేషన్ పేరుతో మళ్లీ సర్వే చేయడం వల్ల వారిలో ఆందోళన నెలకొందన్నారు పార్టీలతో సంబంధం లేకుండా నిరుపేదలకు న్యాయంచేయాలని ప్రభుత్వాన్ని తోట డిమాండ్ చేశారు.

ద్రాక్షారామంలో భారీ వర్షం

ప్రజాశక్తి - రామచంద్రపురం

అధిక ఉష్ణోగ్రతలతో అల్లాడుతున్న వేళ ద్రాక్షారామంలో శుక్రవారం మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు భారీ వర్షం కురిసింది. భారీ వర్షానికి జనజీవనం అస్తవ్యస్తమైంది. అయితే ముమ్మరంగా సాగుతున్న దాళ్వా వరి కోతలు, వ్యవసాయ పనులు వర్షంతో ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. మరోవైపు రైతులు ఆరబెట్టుకున్న ధాన్యం కొన్ని చోట్ల తడిసిపోయింది. మరో రెండు రోజులపాటు వర్షాలు కురుస్తాయన్న సమాచారంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

సికిల్ సెల్ వ్యాధి నివారణకు చర్యలు

ప్రజాశక్తి - ఆలమూరు

సికిల్ సెల్ వ్యాధి నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు ఇన్‌ఛార్జి డిఎల్‌పిఒ, ఎంపిడిఒ ఎ.రాజు, పిహెచ్‌సి వైద్యాధికారులు డాక్టర్ డి.సాయి కిషోర్, డాక్టర్ కె.శ్రీకాంత్ అన్నారు. మండలంలోని పెదపల్ల, చొప్పెల్ల పిహెచ్‌సిల్లో వైద్య సిబ్బందికి సికిల్ సెల్ నివారణకు వైద్యాధికారుల ఆధ్వర్యంలో శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. పిహెచ్‌సిలను సందర్శించిన ఎంపిడిఒ రాజు మాట్లాడుతూ రాష్ట్రంలోని ఉత్తరాంధ్ర మూడు జిల్లాల్లో ఉన్న దాదాపు 10 లక్షల గిరిజన జనాభాలో కనీసం పది శాతం మందికి ఈ జబ్బు లక్షణాలు ఉండటాన్ని వైద్య పరీక్షలలో తేలిందన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఏ ప్రాంతాల్లో అయితే తరచూ మలేరియా బారిన పడ్డారో ఆ ప్రాంతాల్లో ఈ సికిల్ సెల్ అనీమియా అధికంగా కనిపిస్తోందన్నారు. మండల పరిధిలో షెడ్యూల్ ట్రెబు జనాభాలో 40 ఏళ్ల లోపు వారికి సికిల్ వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేస్తారన్నారు. దీనికి సంబంధించి ఎఎన్ఎంలు అందరికీ శిక్షణ ఇచ్చారన్నారు. అయితే మండల పరిధిలో షెడ్యూల్ ట్రైబ్ కు చెందిన జనాభా 811 మంది ఉన్నారన్నారు. ఇందులో చొప్పెల్ల పిహెచ్‌సి పరిధిలో 252 మంది, పెదపళ్ల పిహెచ్‌సి పరిధిలో 559 మంది జనాభా ఉన్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి కె.జ్యోతి కుమార్, హెల్త్ ఎడ్యుకేటర్లు బి.సూర్యనారాయణ, రాజా అక్కుల, సిహెచ్‌ఒ ఎంఎస్ఎన్.రెడ్డి, సబ్ యూనిట్ ఆఫీసర్ సిహెచ్.వెంకటేశ్వరరావు, ఎంపిహెచ్ఎస్‌లు శివప్రసాద్, ఎఆర్‌బి.మణి, ఎఎన్ఎంలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



అవగాహనా సదస్సులో మాట్లాడుతున్న ఎంపిడిఒ రాజు

భవన నిర్మాణ అనుమతులకు వెసులుబాటు

ప్రజాశక్తి - ముమ్మిడివరం

భవన నిర్మాణాలకు స్వీయ ధ్రువీకరణ పత్రం సమర్పించి, అనుమతులు పొందే విధంగా ప్రభుత్వం వెసులుబాటు కల్పించిందని ముమ్మిడివరం నగర పంచాయతీ కమిషనర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నగర పంచాయతీ పరిధిలో ప్రజలు ఇళ్ల నిర్మాణం కోసం లైసెన్స్ పొందిన/ లైసెన్స్ టెక్నికల్ పర్సన్స్ / సర్వేయర్స్/ ఇంజినీర్లు ద్వారా ఆమోదం పొంది స్వీయ ధ్రువీకరణ పత్రం సమర్పిస్తే నిర్మాణాలు చేపట్టవచ్చునన్నారు. ఈ విధానంలో ఆమోదం పొందిన లేఔట్లు, గ్రామ కంఠం, సర్క్యూలేషన్ ప్యాట్రాన్ ప్రాంతాల్లో నివాస యోగ్యత కలిగిన ప్రాంతాల్లో పట్టణ టౌన్ ప్లానింగ్ అధికారుల మార్గ దర్శకాల మేరకు భవన నిర్మాణాలు సులభ రీతిలో చేపట్టుకోవచ్చునని ఆయన తెలిపారు.

వెల్డింగ్ ఓనర్స్ నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి - అమలాపురం

అమలాపురం లేతు, ఆర్కు, వెల్డింగ్ ఓనర్స్ అసోసియేషన్ 38వ వార్షికోత్సవం సందర్భంగా నూతన కార్యవర్గాన్ని శుక్రవారం అమలాపురం సంఘ భవనములో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎన్నుకున్నారు. యూనియన్ నూతన అధ్యక్షునిగా రమణాతి రవి ప్రసాద్, యూనియన్ ముఖ్య సలహదారులుగా దంగేటి బుజ్జి, కార్యదర్శిగా సంగాని రాంబాబు, కార్యవర్గ సభ్యులుగా గెద్దాడ శ్రీనివాసరావు, కండిబోయిన రాము, కట్టా సత్యనారాయణ, వెలిగట్ల సూరిబాబు, గుత్తుల వెంకటేశ్వరరావు, చొల్లంగి నాగేశ్వరరావు, ఎన్నికయ్యారు. కార్యక్రమానికి బివిసి విద్యాసంస్థల అధినేత బోనం కనకయ్య, ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు కల్వకొలను తాతాజీ ముఖ్య అతిథులుగా హాజరై నూతన కార్యవర్గాన్ని అభినందించారు.



సత్యనారాయణ,విజయలక్ష్మి దంపతులను సన్మానిస్తున్న ఎంఎల్‌సి ఇజ్రాయేల్

సత్యనారాయణ సేవలు అభినందనీయం


ప్రజాశక్తి - అల్లవరం

గోడి గ్రామంలో గోడి గ్రంథాలయ శాఖలో రికార్డ్ అసిస్టెంట్ గా పనిచేసి ఉద్యోగ విరమణ పొందిన పడమటి సత్యనారాయణ ను ఆంధ్రప్రదేశ్ శాసన మండలి సభ్యులు బొమ్మి ఇజ్రాయిల్ శుక్రవారం ఘనంగా సన్మానించారు. గోడి శాఖ గ్రంథాలయంలో గతి 20 సంవత్సరాలుగా విశేష సేవలు అందించి గ్రంథాలయ అభివృద్ధికి దోహదపడ్డారన్నారు. ఉద్యోగ విరమణ పొందిన పడమటి సత్యనారాయణ, విజయలక్ష్మి దంపతులను దుశ్శాలువాతో సన్మానించి జ్ఞాపిక అందజేశారు. ఈ కార్యక్రమంలో రుద్రరాజు సూర్యనారాయణరాజు , గజపతి వర్మ, ఉద్యోగస్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలను అరికట్టేందుకు కృషి

ప్రజాశక్తి - ఉప్పలగుప్తం

బాల్య వివాహాల వలన కలిగే దుష్పలితాలను ప్రజలకు వివరించి బాల్య వివాహాలను అరికట్టేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని సర్పంచ్ ఇసుకపట్ల జయమణి కోరారు.చల్లపల్లిలో శుక్రవారం సర్పంచ్ జయమణి ఆధ్వర్యంలో శిశు సంక్షేమ శాఖ వివిధ శాఖల సమన్వయంతో కిశోరి వికాసం కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా గ్రామంలో అంగన్ వాడీ టీచర్‌లు, ఆరోగ్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు.11 నుంచి 18 ఏళ్ల లోపు బాలికలకు బాల్య వివాహాలపై అవగాహన కల్పించారు.



చల్లపల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న సర్పంచ్ జయమణి

సమస్య పరిష్కారంపై హర్షం

ప్రజాశక్తి - ఆలమూరు

రబీ ధాన్యం సేకరణ అంశంలో మండలానికి చెందిన రైతులు ఎదుర్కొంటున్న సమస్యకు ఎట్టకేలకు పరిష్కారం లభించింది. శుక్రవారం ప్రభుత్వం మండలంలోని రైతుల నుంచి 23వేల క్వింటాళ్ల ధాన్యాన్ని కొనుగోలు చేయాలని సివిల్ సప్లై శాఖను నిర్దేశించడంతో రైతులు హర్షం చేస్తున్నారు. రైతుల సమస్యను ఆలమూరు మండల పర్యటనకు విచ్చేసిన ఎంఎల్ఎ బండారు సత్యానందరావు దృష్టికి తీసుకుని వెళ్లారు. అమరావతి వెళ్లిన ఆయన అక్కడ మంత్రి అచ్చెన్నాయుడును కలుసుకుని సమస్యను పరిష్కరించాలని కోరారు. ఎంఎల్ఎ బండారు కృషితో ప్రభుత్వ అధికారులు వేగంగా స్పందించారు. సమస్య పరిష్కారానికి ఎంఎల్ఎ సత్యానందరావుకు రైతులు కృతజ్ఞతలు తెలియజేశారు.